SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్
D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

వార్తావళి

తెలుగు దినపత్రిక

వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : శుక్రవారం 18 సెప్టెంబర్ 2020 ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం VAARTAVALI TELUGU DAILY పేజీలు : 8 రూ. 1.00 సంపుటి 5 సంచిక 209

ప్రధాని మోదీకి సీఎం వైఎస్ జగన్

శుభాకాంక్షలు

అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 17 : ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు పురస్కరించుకొని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్విటర్ ద్వారా గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.' ప్రధాని మోదీజీ మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని.. ఎల్లప్పుడు ఆయురారోగ్యంతో ఉండాలని ఆ దేవుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా.' అంటూ ట్వీట్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రధాని మోదీకి ట్విటర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. 'దేశ సేవకు అంకితమైన మీరు ఇలాంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని ఆ దేవుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. దేశానికి మీలాంటి వ్యక్తి ప్రధానమంత్రిగా ఉండటం మాకు ఆశీర్వాదం.'అంటూ తెలిపారు. ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి చెందాలని గవర్నర్ ఆకాంక్షించారు.

కనకదుర్గ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం మళ్లీ వాయిదా

విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 17 : విజయవాడ నగర వాసులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కనకదుర్గ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం మరోసారి వాయిదాపడింది. ఈనెల 18(శుక్రవారం)న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించాల్సి ఉంది. కానీ, నిన్న నితిన్ గడ్కరీకి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీ కేశినేని నాని తెలిపారు. అయితే, ప్రజల అవసరాల దృష్ట్యా కనకదుర్గ ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలను రేపటి నుంచి అనుమతిస్తున్నట్లు ఆయన ట్విటర్ ద్వారా వెల్లడించారు. తొలుత ఈ ఫ్లైఓవర్‌ను ఈనెల 4న ప్రారంభించాలని భావించారు. ఆ సమయంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కన్నుమూత నేపథ్యంలో కేంద్రం వారం రోజుల పాటు సంతాప దినాలను పాటించాలని సూచించింది. దీంతో ప్రారంభోత్సవం వాయిదా పడిన విషయం తెలిసిందే. కాగా, ఇటీవల ఫ్లైఓవర్‌పై తీసిన డ్రోన్ వ్యూ ఆకట్టుకుంటోంది. ఇంద్రకీలాద్రిని ఆనుకుని, కృష్ణమ్మ ఒడిలో నిర్మించినట్లుగా కనిపిస్తున్న ఈ వంతెన బాగా అనిపిస్తోంది. ఓ పక్క దుర్గమ్మ.. మరోపక్క కృష్ణమ్మ.. వీరిద్దరినీ కలిపినట్లుగా నిర్మించిన ఈ వారధి విశేషంగా ఆకట్టుకుంటోంది.

హైకోర్టు ఉత్తర్వులు: కేంద్రం జోక్యం చేసుకోవాలి

న్యూఢిల్లీ: చట్టం ముందు అందరూ సమానులే అన్న సూత్రాన్ని విస్మరించి న్యాయవ్యవస్థ పక్షపాతంతో వ్యవహరిస్తోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి అన్నారు. తాను ఏ జడ్జికి ఉద్దేశాలు ఆపాదించడం లేదని అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే నిషేధం విధిస్తారని వివరించారు. న్యాయ స్థానాలు మీడియా నోరు నొక్కు తున్నాయని, పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మాన్ని కాపాడాల్సిన వారి వారే పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని అన్నారు. తాజా వివాదంపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయనఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి పార్లమెంట్ వద్ద గురువారం మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ వ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని రాజ్యసభలో ఆయన వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాజాగా విధించిన ఉత్తర్వులపై న్యాయపరమైన అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని అభిప్రాయపడ్డారు.

ప్రధానికి పరిస్థితి వివరిస్తాం

ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ వవస్థ పనితీరుపై ప్రధాని నరేంద్ర మోదీని, మిగతా కేంద్ర మంత్రులను కలిసి పరిస్థితి వివరిస్తామని వైఎస్సార్‌సీపీ లోక్ సభ పక్షనేత మిథున్ రెడ్డి అన్నారు. ప్రజల అభివృద్ధి పనులుకు కూడా కోర్టులు అడ్డుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థలో కొంత మంది వల్ల ఈ పరిస్తితి తలెత్తిందని విమర్శించారు. కుంభకోణాలపై దర్యాప్తులు జరుగుతుంటే కోర్టులు అడ్డుపడటం వింతగా ఉందని ఎంపీ మిథున్‌రెడ్డి వ్యాఖ్యా నించారు. కుంభకోణాలను వెలికితీయాలని కోర్టులే ఆదేశించాలని అన్నారు. పార్లమెంట్ లోపల తమకు మాట్లాడే అధికారం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

91 యేళ్ల వయసులోనూ ఆన్‌లైన్ క్లాసులు



చాలా మందికి టీచింగ్ అంటే ఓ వృత్తి. ఉపాధి కోసం చేసే పనిగా భావిస్తారు. కానీ, ఆయన మాత్రం టీచింగ్‌ను ఓ వృత్తిలాకాకుండా ఓ ఫ్యాషన్‌గా భావించారు. అందుకే.. 91 యేళ్ల వయసులోనూ ఆన్‌లైన్ క్లాసులు బోధిస్తున్నారు. కరోనా మహమ్మారి కారణంగా స్కూళ్లు మూతబడటంతో వర్చువల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ 91 యేళ్ళ ప్రొఫెసర్ సెయింట్ థామస్ విశ్వవిద్యాలయంలో 50 యేళ్లుగా ఇంగ్లీష్ పాఠ్యాంశాన్ని బోధిస్తున్నారు. ఈ యవసులోనూ ఎంతో ఓపిగ్గా ఐరన్ దుస్తులు, షూస్ వేసుకొని ఒక బాస్‌లా వర్చువల్ బోధనను స్వీకరిస్తున్నారు. ఎన్నో దశాబ్దాల నుంచి బోధిస్తున్నప్పటికీ వృత్తి మీద అభిరుచి ఉత్సాహం మాత్రం మొదటిసారిలా ఉంది. ఈయన క్లాసులు వినే పిల్లలు ఎంత అదృష్టవంతులో అంటూ ప్రొఫెసర్ కూతురు జులియా ఫేస్‌బుక్‌లో ఫోటోను షేర్ చేశారు. ఈ పోస్ట్‌ను 62 వేలకు పైగానే లైక్ చేశారు. అంతేకాదు 23 వేలమంది షేర్ చేశారు. ఈయన వృత్తి, నిబద్ధత పట్ల నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

ఏపీ హైకోర్టుపై రాజ్యసభలో ఘాటు వ్యాఖ్యలు

గత కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు తీర్పులు, ఆదేశాలు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ఒక వర్గానికి అనుకూలంగా కోర్టు వ్యవహరిస్తోందనే భావనలో ప్రభుత్వం ఉన్నట్లు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అభిప్రాయ పడిన విషయం తెలిసిందే. మాజీ అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి రమేశ్, అలాగే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఇద్దరు కుమార్తెల పేర్లు రాజధాని భూముల వ్యవహారంలో ఏసీబీ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఉండడం, ఆ కేసు విచారణపై స్టే విధించడంతో పాటు కనీసం ఆ సమాచారాన్ని మీడియా రాయకూడదని హైకోర్టు చీఫ్ జస్టిస్ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం దుమారం రేపుతోంది.ఈ విషయమై నిన్న పార్లమెంట్‌లో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రస్తావించారు. నేడు కూడా ఆ పరంపర కొనసాగింది. వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి రాజ్యసభలో గురువారం మాట్లాడుతూ ఏపీ హైకోర్టుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభలో విజయసాయిరెడ్డి ఏం మాట్లాడారో ఆయన మాటల్లోనే..."ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ వ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు. న్యాయ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత, పక్షపాతంతో ఉంది. ఈ ధోరణి వెంటనే మానుకోవాలి. న్యాయ వ్యవస్థ కారణంగా ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసాధారణంగా వ్యవహరిస్తోంది. మీడియా, సోషల్ మీడియాపై నిషేధం విధించింది. మాజీ అడ్వకేట్ జనరల్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రిపోర్టు చేయవద్దని నిషేధం విధించింది. బ్రిటిష్ తరహాలో వ్యవహరిస్తూ.. దీనికి సంబంధించిన మరో కేసు పైన కూడా స్టే విధించారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఇలా వ్యవహా రిస్తున్నారు. మీడియా కవరేజ్, పబ్లిక్ స్క్రూటినీ లేకుండా తప్పించుకోవాలని చూస్తున్నారు. జ్యుడీషియల్ నుంచి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ కరోనా నియంత్రణలో ముందంజలో ఉంది" అని తెలిపారు. ఏపీ సర్కార్ ధోరణి చూస్తుంటే హైకోర్టు వ్యవహారాన్ని సీరియస్‌గానే తీసుకున్నట్టు కనిపిస్తోంది. అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఒక్కొక్కరు ఒక్కో వేదికపై నుంచి హైకోర్టుకు హితవు పలుకుతుండడం దేశ వ్యాప్త దృష్టిని ఆకర్షిస్తోంది. మరోవైపు కనీసం ఎఫ్ఐఆర్ గురించి కూడా మీడియా రిపోర్ట్ చేయవద్దని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆదేశించడం దేశంలోని పలువురు ప్రసిద్ధ జర్నలిస్టులు, న్యాయకోవిదులు తీవ్ర అభ్యంతరం, నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశ అత్యున్నత చట్టసభలైన లోక్‌సభ, రాజ్యసభల్లో వైసీపీ సభ్యులు ఏపీ హైకోర్టుపై ఘాటు వ్యాఖ్యలతో పాటు హితవు చెబుతుండడం ...మొత్తం దేశ వ్యాప్త దృష్టిని ఆకర్షించడంతో పాటు ఆలోచింపజేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు తీర్పులు, ఆదేశాలపై దేశ వ్యాప్తంగా పలువురు ప్రముఖులు. మేధావులు, ఆలోచనాపరులు ఆరా తీస్తుండడం గమనార్హం.

కార్డు లేకుండా వాచీతో పేమెంట్స్ చేయండి

యోనో యాప్ ఆధారంగా పనిచేసే టైటాన్ పేమెంట్ వాచీలని ఆవిష్కరించాయి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టైటాన్. డెబిట్ కార్డ్ స్వైపింగ్ అవసరం లేకుండా పాయింట్ ఆఫ్ సేల్‌లపై వాచీని ఉంచి చెల్లింపులు పూర్తి చేయవచ్చు. ఈ మేరకు ఎస్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. వినియోగదారులు ఈ సౌలభ్యం పొందాలంటే యోనో యాప్‌లో నమోదయి ఉండాలి. ప్రస్తుతం యోనో యాప్‌ను 2.6 కోట్లమంది నమోదిత వినియోగదారులు ఉన్నారు. పిన్ నెంబర్ టైప్ చేయకుండానే రూ.2,000 వరకు చెల్లింపులు జరపవచ్చు. ఏటీఎంలో డబ్బులు డ్రా చేస్తున్నారా, సెప్టెంబర్ 18 నుండి కొత్త రూల్... తెలుసుకోండి యోనో యాప్‌తో అనుసంధానమైన టైటాన్‌పే వాచీ మార్కెట్లోకి రావడంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఎస్బీఐ చైర్మన్ రజనీష్ కుమార్, టైటాన్ ఎండీ వెంకటరామన్‌లు ఈ వాచీని వర్చువల్‌గా విడుదల చేసారు. ఈ వాచీతో ఎస్బీఐ కస్టమర్లు పీఓఎస్‌ల వద్ద డెబిట్ కార్డు స్వైప్ చేయాల్సిన అవసరంలేదు. చేతికి ఉన్న యోనో ఆధారిత టైటాన్ వాచీతో కస్టమర్లు సరికొత్త షాపింగ్ అనుభూతిని పొందుతారు. రోజురోజుకు డిజిటల్ ట్రాన్సాక్షన్స్ పెరుగుతోన్న విషయం తెలిసిందే. ఇలాంటి ఇది ఎంతో ప్రయోజనకరమని చెబుతున్నారు. కస్టమర్లు యోనోలో రిజిస్టర్ కావాలి. వాచ్ స్ట్రాప్‌లో అమర్చిన, టాపీ టెక్నాలజీస్ సంస్థ అభివృద్ధి చేసిన సురక్షిత ఎన్ఎఫ్‌సీ (నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్) చిప్ సహాయంతో కాంటాక్ట్‌లెస్ చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతుంది. రూ.2,000 వరకు చెల్లింపులు జరపవచ్చు. పీవోఎస్ మిషన్లు అందుబాటులో ఉన్న ప్రతిచోట టైటాన్ పే పని చేస్తుంది. ఈ ఫీచర్ యాక్టివేషన్ కోసం యూజర్లు తమ ఎస్బీఐ ఖాతాతో కేవైసీ వెరిఫై చేయాల్సి ఉంటుంది. ఎస్బీఐ యోనో యాప్ ద్వారా టైటాన్ పే యాక్టివేట్ అవుతుంది. ఈ వాచీ ధర రూ.2,995 నుండి రూ.5,995 మధ్య ఉంది. ఐదు వాచ్ మోడల్స్‌లలో మూడు పురుషుల కోసం, రెండు మహిళల కోసం డిజైన్ చేసింది టైటాన్. పురుషుల వాచీల ధరలు రూ.2,995, రూ.3995, రూ.5995గా ఉంది. స్త్రీల వాచీలు రూ.3,895, రూ.4,395గా ఉన్నాయి. రౌండ్ డయల్ డిజైన్‌తో నలుపు, గోదుమ రంగు స్ట్రాప్‌లతో ఈ వాచీలు లభిస్తాయి.

కరోనాతో కన్నుమూసిన మరో ఎంపీ !

ప్రపంచాన్ని పడికిస్తున్న కరోనా మహమ్మారి మనదేశంలో రోజురోజుకి మరింతగా విజృంభిస్తుంది. మనదేశంలో సామాన్యులతో పాటుగా ప్రముఖులు కూడా దిని భారినపడుతున్నారు. రాజకీయ ప్రముఖులు కూడా కరోనా భారిన పడుతున్నారు. ఇప్పటికే కరోనా కాటుకి తిరుపతి ఎంపీ కన్నుమూయగా .. తాజాగా కరోనా మహమ్మారి కాటుకు మరో ఎంపీ బలైపోయారు. ప్రాణాంతక వైరస్ బారిన పడిన రాజ్యసభ సభ్యుడు బీజేపీ నాయకుడు అశోక్ గస్తీ కన్నుమూశారు. కరోనాకు చికిత్స పొందుతూ బెంగళూరు ఆస్పత్రిలో మరణించారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఇదేవల నిర్వహించిన పరీక్షలో ఆయనకు పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. దీంతో సెప్టెంబరు 2న బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చేరారు. ఈ క్రమంలో ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో నేడు తుదిశ్వాస విడిచారు. ఇక ఏడాది జూన్లో జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నికైన అశోక్ గస్తీ ఒక్కసారి కూడా పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనకుండా మరణించడం విచారకరం. కాగా కర్నాటకకు చెందిన అశోక్ గస్తీ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో చేరి తదనంతర కాలంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆక్టివిస్టుగా పనిచేశారు. ఈ క్రమంలో 18 ఏళ్ల వయస్సులోనే బీజేపీలో చేరి కాషాయ కండువా కప్పుకొన్నారు. రాష్ట్ర యువ మోర్చా హెడ్ నుంచి రాజ్యసభ ఎంపీ వరకు అంచెలంచెలుగా ఎదిగారు.

స్వచ్ఛ భారత్ మిషన్.. టాప్ 10లో విశాఖపట్నం!

విశాఖపట్నం స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో దేశంలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి అవార్డు 2020 పోటీలో నిలిచింది. స్వచ్ఛతతో మెరిసిపోతున్న విశాఖ నగరం తాజాగా ప్రధానమంత్రి అవార్డు కోసం ఎంపిక చేసిన పది జిల్లాల జాబితాలో చోటు దక్కించుకుంది.

(మిగతా 7వ పేజీలో)

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది. ఏపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను.
యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.
bulusu333@gmail.com
మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు. 8500159006 నెంబరుకు సంప్రదించగలరు
YouTube

విలేకరులు కావలెను
'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
7032034001, 8500159006

సంపాదకీయం

చైనాతో వివాదం

గత నెలలో అనారోగ్య కారణాలతో పదవినుంచి తప్పుకున్న జపాన్ ప్రధాని షింజో అబే స్థానంలో యొషిహిదే సుగా ఆదివారం ఎంపికయ్యారు. ఇంతవరకూ ప్రధాన కేబినెట్ కార్యదర్శిగా వున్న సుగాకు అధికార పక్షం లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ సమావేశంలో భారీగా ఓట్లు వచ్చాయి. జపాన్ పార్లమెంటు డైట్‌లో బుధవారం ఆయన ఎంపికపై ఓటింగ్ జరుగుతుంది. అబే పాలనలో సుగా పేరు ఎక్కడా వినపడలేదు. బయటి ప్రపంచానికి కూడా ఆయన గురించి పెద్దగా తెలియదు. ఆయన ఏ దేశానికీ వెళ్లింది లేదు. తన దౌత్య నైపుణ్యాన్ని చూపిన సందర్భం లేదు. కానీ అబే ప్రభుత్వం తీసుకున్న ప్రతి విధాన నిర్ణయం రూపకల్పనలోనూ, దాన్ని పకడ్డందీగా అమలు చేయడంలోనూ సుగాదే కీలక పాత్ర. కనుక మన దేశంతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడంతోసహా ఆ పాత విధానాలు యథాతథంగా కొనసాగుతాయనే చెప్పాలి. అయితే అధికారంలోకొచ్చాక సుగా పరిష్కరించాల్సిన సమస్యలు చాలావున్నాయి. అవన్నీ సంక్లిష్టమైనవి. 2012లో షింజో అబే అధికార రంలోకి వచ్చే సమయానికి జపాన్ అన్నివిధాలా నీరసించివుంది. దాన్ని చక్కదిద్దడం అసాధ్యమని అందరూ అనుకున్నారు. కానీ ఆయన చేసి చూపించారు. కరోనా వైరస్ మహమ్మారి విరుచుకుపడక పోతే ఆ జైత్రయాత్ర కొనసాగేది. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. ప్రపంచ దేశాలన్నిటిలాగే ఆర్థికంగా అది దెబ్బతింది. ఆర్నెల్లుగా తయారీ రంగం స్తంభించింది. ఇప్పుడిప్పుడే అది పట్టాలెక్కుతున్న సూచ నలు కనబడుతున్నాయి. పారిశ్రామిక ఉత్పత్తి అంతక్రితంతో పోలిస్తే మెరుగైంది. అయితే గతంతో పోలిస్తే చైనాతో వివాదం ముదురుతోంది. దానితో జాగ్రత్తగా వ్యవహరించడం సుగాకు సవాలే. ప్రధాని పదవి చేపట్టేనాటికి, ఇప్పుడు వైదొలగుతున్న సమయానికి మధ్య షింజో అబే వైఖరిలో వచ్చిన మార్పులు గమనించదగ్గవి. వాటినుంచి సుగా కొత్తగా నేర్చుకోవాల్సిందేమీ లేదు. ఎంచు కంటే ఆ మార్పుల వెనక ముఖ్యపాత్ర ఆయనదే. ప్రారంభంలో అబే జాతీయవాది. స్వేచ్ఛా వివణికి తీవ్ర వ్యతిరేకి. విశాల పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం(టీపీపీ) తమకు అంగీకారం కానేకాదని 2012కు ముందు ఆయన గట్టిగా వాదించేవారు. ఇప్పుడంటే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టీపీపీతో సహా అంతర్జాతీయ ఒప్పందాలు ఏవీ పనికిరావంటున్నారు గానీ... అందుకు చొరవ తీసుకున్నదీ, అందరినీ అందులో చేరేలా ఒప్పించింది అమెరికాయే. దానికి అబే తీవ్ర వ్యతిరేకి. పసి ఫిక్ మహాసముద్ర ప్రాంత దేశాలు సభ్య దేశాలుగా ఉండాలని ప్రతిపాదించిన ఈ ఒప్పందంలో మన దేశాన్ని కూడా భాగస్వామిగా మార్చాలని అమెరికా అప్పట్లో తీవ్రంగా ప్రయత్నించింది. అందుకు సంబంధించిన చర్చల్లో మన దేశం పలుమార్లు పాల్గొంది. చివరకు చేరబోనని మన దేశం చెప్పింది. రెండున్నరేళ్లక్రితం అమెరికాయే దాన్నుంచి తప్పుకుంది. కానీ 2018లో అబే మిగిలిన దేశాలను కలుపుకుని దానికి విశాల పసిఫిక్ భాగస్వామ్య దేశాల సమగ్ర, పురోగామి ఒప్పందం(సీపీటీపీపీ)గా పేరుమార్చారు. ఇదే కాదు... ఇలాంటి మరో డజను ఒప్పందాలు అమలు కావాలన్న కృతనిశ్చ యంతో అబే వున్నారు. అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థకు అమెరికా, చైనాలు రెండూ ముప్పుగా పరి ణమిస్తున్నాయన్నదే ఆయన వాదన. అమెరికాతో సహా అన్ని దేశాలూ ఆత్మరక్షణ విధానాల్లో పడి, వలసలపై ఆంక్షలు విధిస్తే... అబే దానికి భిన్నంగా వలస నిబంధనలు సరళం చేశారు. కనుకనే జపాన్‌లో ప్రస్తుతం 17 లక్షలమంది విదేశీ కార్మికులు పనిచేస్తున్నారు. అబే అధికారంలోకి వచ్చే నాటితో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. సారాంశంలో ఫక్తు జాతీయవాదిగా రంగం మీదికొచ్చిన అబే... ప్రపంచ మార్కెట్‌కు తిరుగులేని నాయకుడిగా రూపొందారు. అలాగని ఆయన దేశంలో అన్నిటినీ ప్రైవేటుపరం చేయాలనే స్వేచ్ఛా మార్కెట్ ఉదారవాది కాదు. ఆర్థిక వ్యవస్థపై బలమైన ప్రభుత్వ నియంత్రణ వుండాలని కోరుకున్న నాయకుడే. అయితే కరోనా అనంతర పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి జపాన్ ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన పాకేజీ ఆశించిన ఫలితాల నివ్వలేదు. వేరే దేశాలతో పోలిస్తే అది మెరుగుపడింది. కానీ అనుకున్న స్థాయిలో లేదు. ఇందుకు కారణం మౌలిక సంస్కరణల అమలులో వెనుకంజేసిన ఆర్థిక నిపుణులంటారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అమెరికా, చైనాల తర్వాతి స్థానం జపాన్‌దే. అమెరికాతో జపాన్‌కు గట్టి స్నేహసంబంధాలున్నాయి. అదే సమయంలో చైనాతోనూ దానికి సుహృద్భావ సంబంధాలే కొనసా గుతున్నాయి. అయితే చైనాకు చెందిన హువీ టెక్నాలజీ సంస్థ 4జీ పరికరాలను వినియోగించరాదన్న అమెరికా ఆంక్షలకు జపాన్ కూడా తలొగ్గింది. అందువల్ల అనేకానేక సమస్యలు కూడా ఎదుర్కొంటోంది. హువీకి, ఇతర చైనా కంపెనీలకు అవసరమైన విడి భాగాలు తయారుచేసే పరిశ్రమలు జపాన్‌వే. చైనాకు జపాన్ వార్షిక ఎగుమతులు నిరుడు 14,000 కోట్ల డాలర్లు. కరోనాతో ఆర్థిక వ్యవస్థ మరీ దిగజారకుండా జపాన్‌కు ఎంతో కొంత కాపాడినవి ఈఎగుమతులే. జపాన్ జాతీయ భద్రతతోపాటు, తూర్పు చైనా సముద్ర ప్రాంతంలో చైనాతో వున్న విభేదాలు జపాన్ కంపెనీలకు ప్రాణాంతకంగా మారాయి.

అమర లింగేశ్వరస్వామి ఆలయం

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి 2015 అక్టోబరు 23 న శంకుస్థాపన జరిగింది. 2017 మార్చి 2న శాసనసభ ప్రారంభించబడి అక్కడనుండి పరిపాలన మొదలింది. జగన్ ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణ కొరకు 2020 జులై 31 న, అమరావతిని కేవలం శాసనరాజధానిగా పరిమితం చేసి,విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా ప్రకటించింది. క్రీస్తు పూర్వం 1వ శతాబ్దం నుండి క్రీస్తు శకం 3వ శతాబ్దం వరకు భారతదేశంలో దాదాపు 60 శాతాన్ని (ప్రస్తుత ఆంధ్రప్రదేశ్,తెలంగాణా, మహారాష్ట్ర,గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక ప్రాంతాలను) పరిపాలించిన శాతవాహన సామ్రాజ్యానికి రాజధాని అయిన ధరణికోట ఈ ప్రాంతం లోనేవున్నది ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధానిగా అమరావతిని ఆమోదించి తరువాత, రాజధాని ప్రాంతం అభివృద్ధి సంస్థ ఏర్పాటయినది.అమరావతి అర్బన్ నోటిఫైడ్ ఏరియా, దాని నగర అభివృద్ధి, ప్రణాళిక కార్యకలాపాలు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతీయ అభివృద్ధి సంస్థనే నిర్వహించబడుతున్నాయి. కొత్త రాజధానికి భూసేకరణ కొత్త తరహాలో అనగ ప్రధానంగా అభివృద్ధిపరచిన నగరంలో ప్లాట్లు ఇచ్చేటట్లు జరిగింది. అమలు ప్రారంభమైన 60 రోజులలో 25000 రైతులనుండి 30000 ఎకరాలను (121.405693 చ.కి.మీ.) సమీకరించారు. కొత్త రాజధాని నగరం యొక్క మొదటి దశలో మూడు మండలాలు అయిన మంగళగిరి, తుళ్ళూరు, తాడేపల్లి లోని 31 గ్రామాలు (కొన్ని గ్రామాల భూభాగములతో సహా) ఉన్నాయి.ఇది కృష్ణా నది ఒడ్డున, గుంటూరు జిల్లాలో భూమి 217,23 చదరపు కిలోమీటర్లు (83.87 చ.మైళ్ళు) లో నిర్మించబడి వుంటుంది. ఈ నగరం విజయవాడ నగరం యొక్క వైరుధ్రి దిశలో 12 కిలోమీటర్లు (7.5 మైళ్ళు), గుంటూరు సిటీ ఉత్తరమునకు 24 కి.మీ. (15 మై.) దూరములో ఉంటుంది.భారత ప్రధాని నరేంద్రమోడి ఉద్దండరాయునిపాలెంలో రాజధాని నగర నిర్మాణానికి 2015 అక్టోబరు 22న విజయదశమి నాడు శిలాన్యాసం (శంకుస్థాపన) చేసారు. ఆంధ్రప్రదేశ్ పరిపాలన భవన సముదాయానికి 2016 అక్టోబరు 28 వ తేదిన అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి, ఎం. వెంకయ్య నాయుడు శంకుస్థాపన చేసారు.2016 జనవరి నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాత్కాలిక సచివాలయ భవన సముదాయానికి శంకుస్థాపన చేసారు. జూన్ 2015 నాటికి పరిపాలన అక్టోబరు నుంచి సాగించాలని భావించినా అది అక్టోబరు నాటికి సాకారమయింది. ఆనతి కాలంలో అన్ని హంగులతో సదుపాయాలతో సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించిన ఘనత ప్రభుత్వానికి లభించింది.రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నగరం నిర్మాణం కోసం సింగపూర్ ఆధారిత అస్సెంబ్లాస్-సిన్క్రైడ్, సెంకోకార్ డెవలప్మెంట్ కన్సార్టియాన్ని ప్రారంభించింది. కొత్త రాజధాని నగరం యొక్క మౌలిక సదుపాయాలు, 7-8 సంవత్సరాల దశలో, 33,000 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయబడతాయి. హద్దో నుండి 7,500 కోట్లు, ప్రపంచ బ్యాంకు నుండి 500 మిలియన్లు, భారత ప్రభుత్వం నుండి 2,500 కోట్ల రూపాయలు, వీటిలో 1,500 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఫైనాన్స్, జస్టిస్, హెల్త్, క్రీడలు, మీడియా, ఎలక్ట్రానిక్స్ కలిగిన తొమ్మిది నేపథ్య నగరాలుబీ నార్మన్ ఫోస్టర్, హఫీజ్ కాంట్రాక్టర్, రిలయన్స్ గ్రూప్, ఇండియా రూపొందించిన ప్రభుత్వ భవనాలు నగరంలోనే నిర్మిస్తారు. 600 మిలియన్ కోట్ల (83 మిలియన్), పై కేర్ సర్వీసెస్ తోటి, ఆరోగ్య సంరక్షణ 'లిమిట' మంగళగిరి ఐటి పార్కులో ప్రారంభించబడింది. హెచ్సినిఎల్ టెక్నాలజీస్ అనే ఒక ఐటి సంస్థ అమరావతిలో తన కేంద్రాలలో ఒకదానిని ఏర్పాటు చేస్తుంది.

సత్సాంగత్యంతోనే జీవన్ముక్తి!

'సంగం', 'సంగమం', 'సంగతి', 'సాంగత్యం' అనే పదాలకు 'కలయిక' అని సామాన్యార్థం. ఏ రకమైన కలయికలనైనా 'సంగం' అనే పిలుస్తారు. 'త్రివేణీ సంగమం' అని నదుల కలయికను చెప్పడం పరిపాటి. అందరూ కలిసి ఉండే విధానాన్ని భౌతికమైన సంగమంగా భావిస్తాం. కానీ, మన ఆలోచనల్లో దేనితో కలిసి ఉన్నా, దానిని కూడా 'సంగం' అని మాత్రమే పిలువాల్సి ఉంటుంది. వేనితో సంగమిస్తున్నామో వాని లక్షణాలను మనం కొన్ని తెచ్చుకుంటామని రసాయనిక చర్యలన్నీ తెలుపుతాయి. పెలుగుతో కలిసి ఉంటే జ్ఞానిగా, చీకటితో కలిసి ఉంటే అజ్ఞానిగా మారడం సహజం. అందుకే, 'సంగం' మానవ జీవితాల్లో చాలా ప్రాధాన్యం వహిస్తున్నది. స్నేహితులు కూడా సంగమానికి ప్రతీకలే. అన్నిటికన్నా ముఖ్యమైనవి భావాలు. భావంతో సంగమించడం వల్ల మంచి-చెడు ఏర్పడుతాయి. 'భగవద్గీత' ఈ అంశానికి చాలా ప్రాధాన్యం ఇచ్చింది. 'సంగం' వల్ల వచ్చే సమస్యలను రెండు శ్లోకాల్లో ఏకరువు పెట్టింది. ధ్యాయతో విషయాన్ పుంసాన్ సంగస్తేషూప జాయతే సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోభి జాయతే? క్రోధాత్ భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమ:స్మృతి భ్రంశాత్ బుద్ధినాశః బుద్ధినాశాత్ ప్రణశ్యతి? మనం లోకంలో ఏ అంశాన్నైనా, వస్తువునైనా చూసినా, విన్నా గుర్తు చేసుకున్నా, ఆలోచించినా దానితో మన 'సంగమం' మొదలవుతుంది. అది కామాలనిపించడం 'కామం'. దొరకకపోతే వచ్చేది 'క్రోధం'. దానితో విడదీయరాని అనుబంధం ఏర్పడటం 'మోహం'. అందులోనే పడిపోయి ఏం చేస్తున్నామో అర్థం కాకపోవడం 'స్మృతి భ్రంశం'. దానివల్ల ప్రవర్తనలో వచ్చే పూర్తి మార్పులే 'బుద్ధి లోపం'. ఈ బుద్ధి సరైనవిధంగా పని చేయకుండా ప్రవర్తించేవాడు పరిపూర్ణంగా నశిస్తుంటాడు. అంటే, 'ఒక వస్తువుతో మన కలయిక మనలను చిరకిరి ఎందుకూ పనికిరాని వాడిగా మారుస్తుందని' భగవద్గీత సారాంశం. అంటే, అనవసరమైన కలయికలవల్ల ఎప్పటికైనా సమస్యలు తప్పవు. అవసరమైన పరతత్వంతో కలయిక (సంగం) ఒక్కటే మనకు కావాలి. బహుముఖమైన ఆలోచనలు ఏకముఖంగా, శక్తిముఖంగా ఉండాలి. అప్పుడే, వ్యక్తి 'సత్సాంగత్యం'లో ఉన్నట్లు అర్థం. ఈ ప్రయత్నం చేయడానికి తగిన జ్ఞానం కావాలి. అలా దానితో సంగమించడానికి తగిన ప్రయత్నమూ ఉండాలి. అదీ చాలా తీవ్రస్థాయిలో ఉండాలి. వస్తువుతో, వ్యక్తితో, వ్యవహారంతో, అధికారంతో, ధనంతో, ఆస్తిపాస్తులతో సంగమిస్తూ మనతో మనం కలిసి ఉండటం ఎలాగో చాలామందికి తెలియదం లేదు. 'శాశ్వతం' కాని వాటిని మన అజ్ఞానం వల్ల శాశ్వతమని భ్రమించి వాటితో కలిసిపోతున్నాం. అవన్నీ వెళ్ళిపోతుంటే విపరీతమైన వేదనకు గురవుతున్నాం. అందుకే, మనలోనూ, మన చుట్టూ ఉండే వైతన్యాన్ని గుర్తించి, దానితో నిరంతరం సంగమిస్తూనే ఉండాలి. దాని గురించే ఆలోచించాలి. శ్రవణం, కీర్తనం, మననం, ధ్యాన అన్నీ దానిపైనే కేంద్రీకరించాలి. అదే 'సత్సంగం' అవుతుంది. శాశ్వతమైన సత్యం లోకంలో ఒక్కటే ఉంటుంది. అదే శక్తి. దానితోనే నిరంతరం సంగమిస్తూ ఉండాలి. అది అత్యంత శుద్ధమైంది. కాబట్టి, మనలోని మాలిన్యాలను క్రమంగా శుద్ధి చేసుకుంటూ దానితో నిరంతరం కలిసి ఉండే ప్రయత్నం చేస్తుంటే, మనమూ 'పరమాత్మ స్వరూపులం' అవుతాం. 'మన దేహమే దేవాలయంగా మారాలంటే మనలోని అజ్ఞానమనే నిర్మాల్యం వెళ్ళిపోవాలని' శంకర భగవత్పాదులవారు ఏనాడో ఉద్ఘోషించారు. సత్యంతో సంగమించడం వల్ల కలిగే 'సత్సాంగత్యం' ఇక ఇతరమైన వానితో సంగమం లేకుండా చేస్తుంది. శంకరులు చెప్పినట్లు సత్సాంగత్యం వల్ల మనిషి సంగ రహితుడవుతాడు. దానివల్ల మోహ రాహిత్యం కలుగుతుంది. క్రమంగా మన మనసు నిశ్చలమవుతుంది. ఈ దశలో ఆ వ్యక్తి పొందే స్థితినే ఆధ్యాత్మిక నిపుణులు 'జీవన్ముక్తి' అంటారు.

దశరథునికి కనిపించిన దృశ్యం

(నన్నటి తరువాయి)

అలాగే సీతాదేవి కూడా ఇది అరణ్యం కాదు, అంతఃపురం అన్నట్లుగా కలివిడిగా తిరుగుతోంది. మీరు వారి గురించి బాధపడనక్కరలేదమ్మా, నేను చెబుతోంది నిజం." అన్నాడు సుమంత్రుడు. నమ్మలేనట్లుగా చూసింది కౌసల్య."నిజం తల్లీ! రామలక్ష్మణులసహా నడుస్తూ తల్లిసీత కనిపించే ప్రతి పల్లెపేరునీ, నదిపేరునీ అడిగి మరీ తెలుసుకుంటోంది. ఆనందిస్తోంది. అల సట అన్న మాటే లేదమ్మా అమె నోట." అన్నాడు సు మంత్రుడు. "చాలా ఆశ్చర్యంగా ఉంది" "అవును తల్లీ! అంతా ఆశ్చర్యమే! తేత చిగుళ్ళల పగడాల్లా మెరిసిపోయే సీత పాదాలు, అరణ్యంలో కూడా అందంగానే ఉన్నాయి తల్లీ. లక్షరసం పూయకపో యినా, అంతఃపురంలో ఉన్నట్టే అతి మృదువూగా ఆమె పాదాలు అలాగే ఉన్నాయమ్మా! ఆమె కాలి అందెల శబ్దం, అంతఃపురంలో కంటే అడవుల్లోనే మారుమ్రోగి, వినసొంపు అనిపించాయి." అన్నాడు సుమంత్రుడు. చిత్రంగా చూసింది కౌసల్య. "సీతా రామలక్ష్మణులు అడవుల్లో హాయిగా ఉన్నారమ్మా! వారేమీ మీరు అనుకున్నంతగా బాధలు పడడం లేదు. మీరు అట్టే బెంగపెట్టుకోనక్కరలేదు. ఆ ముగ్గురూ పెట్టి పుట్టారమ్మా! తిరుగులేని వ్యక్తులు. వారిని తలచుకుని బాధపడడం కంటే తలచుకుని ఆనందించడం మేలు. దయచేసి నా మాట వినండి, ఊరుకోండి." అన్నాడు సుమంత్రుడు.ఎంత చెప్పు, ఎన్ని చెప్పు కౌసల్య గుండెమంటా, బాధా చల్లారడం లేదు. పైగా మరింత పెరుగుతోంది. కోపంగా దశరథుణ్ణి చూసిందామె. తెప్పరిల్లి సేదదీరుతున్నా డు దశరథుడు. నీరు తాగుతున్నాడు. చూసి సహిం చలేకపోయిందామె. బలాన్నంతా కూడదీసుకుని, తాగుతున్న నీటిని విసిరిగొట్టింది. దశరథుని చేతిలోని నీటిపాత్ర తుళ్ళి అంతదూరంలో పడింది. ఆశ్చర్యంగా చూశారంతా. 'నేను మాటంటే మాటే! మాట మీద నిలబడ తాను, మాట తప్పనంటా కైకకి రాజ్యాన్ని కట్టబెట్టి, నా కడుపు కొట్టావు కదయ్య! నేనేం పాపం చేశాను, నా పిల్లల్ని నా నుండి దూరం చేశావు?" దశరథుణ్ణి అడిగింది కౌసల్య. సమాధానం లేదు రాజు దగ్గర నుంచి. బిక్కచచ్చి చూస్తున్నాడంతే!"మీరు మగాళ్ళయ్యా! అడవులా, కొండలా అన్నీ దాటిపోగలరు. అదది దాటగలదా చెప్పు? సీత ఎంత సుకుమారో నీకు తెలీదా? అందంటే సుకుమారి ఎందకి ఎండి, వానకి తడిసి, చలికి వణుకుతూ ఎంత బాధపడుతోందో? పొద్దునే మంగళవాద్యాలతో మేలుకునే సీత, ఇప్పుడు ఏ మృగాల గర్జనలకు మేలుకోవాలో? అసలు నిద్రపోతోందో లేదో!" బోరుమంది కౌసల్య."నా రాముడు ఇంద్రధనుజ్జం లాంటివాడు. అలాంటి వాడు ఎక్కడ పడుకున్నాడో? ఎలా ఉన్నాడో?" అన్నది కౌసల్య. దశరథుని చూసింది."కన్నబిడ్డలను అడవుల పాలు చెయ్యమని ఏ ధర్మశాస్త్రంలో ఉందయ్యా. ఏ ధర్మశాస్త్రంలో ఉంది, అలా చేశావు." అడిగింది."ఆడదానికి మొదటి దిక్కు మొగుడే! తర్వాతే పిల్లలూ, ఇతర బం?ధువులూను. బంధువులన్నవారు నాకెవరూ లేరు. ఏనాడో పోయారు. పిల్లలా అడవుల పాలయ్యారు. పిల్లలతో అడవులకు పోదామంటే, నువ్వు బతికి ఉన్నావు. నువ్వు బతికి ఉండగా నేనెలా పోతాను, పోలేను. అది ధర్మం కూడా కాదు. ఇటు నిన్ను వదులుకోలేను, అటు పిల్లల్ని వదులుకోలేను, నేనెలా బతకాలయ్యా? నన్నెలా బతకమంటావు?" దశరథుని ముఖంలో ముఖం పెట్టి, గట్టిగా అరిచింది కౌసల్య.

ఆ అరుపునకు కళ్ళు మూసుకుని రోదించసాగాడు దశరథుడు. "నువ్వు చేసిన ఈ పనికి ఆ కైకా, ఆమె కొడుకు భరతుడూ తప్ప ఇంకెవరూ ఆనందించరయ్యా! ఆనందిస్తున్నారని నువ్వు అనుకుంటే అది భ్రమే." అంది."నీకో సంగతి తెలుసా? నా కొడుకు రాముడు అభిమానధనుడు. అతను పద్నాలుగేళ్ళ అనంతరం, రాజ్యానికి తిరిగి వచ్చినా, తమ్ముడు ఏలిన రాజ్యాన్ని స్వీకరించదయ్యా, స్వీకరించడు. ఎంగిలికూడు ముట్టడుగాక ముట్టడు. ఇంకో జంతువు తినగా మిగిలిన మాంసాన్ని పులిలాంటిదే ముట్టడు, అలాంటిది నా కొడుకు, నరకార్హులు, తమ్ముడు ఏలిన రాజ్యాన్ని తీసుకుని, తగుదునమ్మా అంటూ ఏలుతాడనుకున్నావా? ఏలడుగాక ఏలడు. మోసగించడం, మోసపోవడం రాముడికి తెలీద య్యా. అలాంటివాణ్ణి నువ్వు మోసగించావు.

(దుగరా రేపటి సంచికలో)

నల్లటి వలయాలు ఇలా మాయం!

కళ్ల దగ్గర చర్మం పలచగా ఉంటుంది. సూర్యరశ్మిలోని హానికర కిరణాలు కళ్ల దగ్గరి చర్మాన్ని తొందరగా ముడతలు పడేలా చేస్తాయి. అలానే వయసు పెరుగుతున్న కొద్దీ కళ్ల కింద ఏర్పడే నల్లటి వలయాలు ఇబ్బందిగా అనిపిస్తాయి. వాటిని సహజ పద్ధతిలో వీటిని తొలగించి కళ్లను అందంగా మార్చు కోండిలా... ఎండలో బయటకు వెళ్లే ముందు కళ్లకు రక్షణగా క్రీమ్ రాసుకోవాలి. కళ్ల దగ్గరి చర్మం తేమగా ఉండేలా చూసుకోవాలి. కళ్ల వాపు తగ్గించడంలో బంగాళదంప బెస్ట్. దీనిలోని ఎంజైమ్‌లు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, కళ్ల కింది చర్మాన్ని బిగుతుగా చూస్తాయి. బంగాళదుంపను ముక్కలుగా కోసి, వాటి కి పిన్నులు గుచ్చి ఫ్రిజ్‌లో పెట్టాలి. వీటిని కళ్ల మీద పది నిమిషాల పాటు ఉంచాలి. తరువాత నీళ్లతో శుభ్రం చేసుకొని ఐ క్రీమ్ రాసుకోవాలి. దీనిలో చర్మానికి పోషణనిచ్చి, చర్మాన్ని దృఢంగా మార్చే గుణాలు న్నాయి. తాజా కీరదోసను సన్న ముక్కలుగా కోసి కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. వాటిని కళ్ల మీద 10 నిమిషాలు పెట్టు కోవాలి. దాంతో కళ్ల కింది చర్మ నికి రక్తప్రసరణ పెరిగి వలయాలు, మచ్చలు మాయమవుతాయి. వీటి లోని లైకోపిన్ చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. అంతేకాదు కళ్ల కింది నల్లటి వలయాలను తగ్గిస్తుంది. టొమాటో ముక్కలను కళ్ల మీద పెట్టుకోవాలి. లేదంటే టొమాటో రసం, కలబంద గుజ్జు సమపాళ్లలో తీసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ రాసుకుంటే తేమ అంది కళ్లుతాజాగా కనిపిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలున్న ఈ టీ కళ్ల కింది చర్మానికి సాంత్వననిస్తాయి. దామంతి టీ బ్యాగును నీళ్లలో కొద్దిసేపు ఉంచాలి. తరువాత వాటిని ఫ్రిజ్‌లో 30 నిమిషాలు పెట్టాలి. ఈ టీ బ్యాగులను కళ్ల మీద పెట్టుకుంటే కళ్ల దగ్గరి నరాలకు ఉపశమనం లభిస్తుంది.

మధుమేహులు గుండెను కాపాడుకోవడం ఎలా?

మధుమేహంతో బాధపడేవారు గుండె విషయంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. మధుమేహ రోగులకు గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని ఇటీవల జరిపిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. దీర్ఘకాలం పాటు మధుమేహం వ్యాధితో ఇబ్బంది పడేవారి హృదయ స్పందనల్లో ఊహించని మార్పులు వస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. షుగర్‌కు మాత్రలు వేసుకుంటున్నా, రక్తంలో షుగర్ స్థాయిలు అదుపులోనే ఉన్నాయి అని మధుమేహులు సరిపెట్టుకోవడం పెద్ద పొరపాటే అవుతుంది. మధుమేహానికి దీర్ఘకాలంగా మందులు వాడుతున్నా, తెలియకుండానే గుండె పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుండె ఎదమ జకరక (వెంట్రికల్)లో రక్తాన్ని శుద్ధిచేసి ధమనుల్లోకి పంపే ప్రక్రియ జరుగుతుంది. అయితే మధుమేహం కారణంగా గుండె సంకోచ, వ్యాకోచాల సమయంలో ఎదమ జరకక నుంచి విడుదలయ్యే రక్త శాతం ప్రామాణిక భాగం (ప్రిజర్వుడు ఎజెక్షన్ ఫ్రాక్షన్ మెజర్‌మెంట్) తగ్గిపోయే ముప్పు ఉంది. జరకక నుంచి నిర్దేశిత ప్రామాణిక అంశం కన్నా రక్తం విడుదల చాలా తక్కువ ఉన్నట్లయితే గుండె వైఫల్యానికి (హార్ట్ ఫెయిల్యూర్) దారితీస్తుంది. అందువల్ల కేవలం షుగర్ లెవెల్స్ నియంత్రణలోనే ఉన్నాయికదా అని మధుమేహులు సరిపెట్టుకోవడం తగదని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. హైపర్ టెన్షన్, ధమనుల్లో రక్తం గడ్డకట్టడం వంటి గుండె సంబంధిత వ్యాధుల ఫలితంగా గుండెపోటు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఎప్పుడూ అవే కారణం కావాల్సిన పరిస్థితి లేదని అమెరికాకు చెందిన ఒక వైద్య కళాశాలలోని రోగులు సహా పలువురిపై అధ్యయనం జరిపిన అనంతరం పరిశోధకులు తేల్చారు. డయాబెటిక్ కార్డియాలజీ గుండెపోటు అనే అంశం ఆధారంగా నిర్వహించిన పరీక్షల్లో మధుమేహం ప్రభావం వల్ల కూడా గుండె విఫలమవుతుందని గుర్తించారు. గుండె కొట్టుకునే సమయంలో గుండె నుంచి విడుదలయ్యే రక్త శాతం ప్రామాణిక భాగం (ఎజెక్షన్ ఫ్రాక్షన్ మెజర్‌మెంట్ ఆఫ్ బ్లడ్) విషయంలో దీర్ఘకాలంలో గుండె విఫలం చెందడంపై మధుమేహం ప్రభావాన్ని శాస్త్రవేత్తలు పరిశీలించారు. అధ్యయనంలో భాగంగా హైపర్‌టెన్షన్, గుండె ధమనుల సమస్య, ఇతర గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స పొందే మధుమేహం లేని 232 మందితో 116 మంది మధుమేహ బాధితులను పోల్చి చూశారు.

ఆ.వె .

కూడునేనె., నేనెగూడు కట్టెనునేనె
బట్టయేను మోసె పాడి నేనె
ఆయువులను ప్రాణ
వాయువు లనునేనె!
అట్టి చెట్టు గొప్ప
దనగ లేమ!

- మల్లాది సోమేశ్వర శర్మ,
9603995769



(మొదటి పేజీ తరువాయి)

దక్షిణాది రాష్ట్రాల తరఫున ఎంపికైన ఏకైక జిల్లాగా నిలిచింది విశాఖ. విశాఖ జిల్లాలోని మూడు పట్టణ స్థానిక సంస్థలు కలిపి ఒక క్లస్టర్ గా పోటీలో పాల్గొన్నాయి. స్వచ్ఛ సర్వేక్షన్ లో ఈ సంవత్సరం 14 స్థానాలు ఎగబాకి తొమ్మిదో స్థానంలో నిలిచిన విశాఖ స్వచ్ఛత లో టాప్ 10 మహానగరాల చెంత నిలిచింది. స్వచ్ఛత ప్రమాణాలను పాటిస్తూ తడి చెత్త పొడి చెత్త లను విభజిస్తూ చెత్త నుండి ఎరువు ను తయారు చేస్తూ చెత్తరహిత నగరంగా విశాఖ ఇప్పటికే గుర్తింపు పొందింది. ఇప్పుడు పీఎం అవార్డుకు ఎంపిక చేసిన టాప్ టెన్ మహానగరాలలో విశాఖ స్థానాన్ని పొందింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే స్వచ్ఛ భారత్ మిషన్ ప్రజల భాగస్వామ్యం కేటగిరీలో ప్రధానమంత్రి అవార్డు కోసం విశాఖ మహానగరం పోటీ పడుతోంది. ఈ పోటీలో ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత స్థానిక సంస్థలు అందించే సేవలు చెత్త విభజన ప్రజలకు కల్పించే అవగాహన కార్యక్రమాలు వ్యక్తిగత పరిశుభ్రత సమన్వయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం మొదలైన అంశాలలో ప్రజల అవగాహన భాగస్వామ్యం ఎలా ఉంది అన్న దానిపై పోటీ నిర్వహిస్తున్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటుగా నర్సీపట్నం యలమంచిలి మున్సిపాలిటీలు కలిపి జిల్లా యుఎల్ బి క్లస్టర్ గా ఏర్పడి ఈ అవార్డు కోసం పోటీలో నిలిచాయి. అక్కడి ప్రజల యాక్టివ్ పార్టిసిపేషన్ మీద అవార్డు వచ్చేది లేనిది తెలుస్తుంది. రాష్ట్రంలో తొలిసారిగా విశాఖ నగరంలోని యూజర్ ఫ్రెండ్లీ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. అంతేకాదు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ లోనూ చెత్త నుంచి విద్యుత్ తయారీలోనూ భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ విషయంలోనూ విశాఖ ముందంజలో ఉంది. ప్రమోటింగ్ పీపుల్స్ మూమెంట్ జన భాగీరథ పేరుతో ఈ అవార్డులను అందించనున్నారు. ఇందులో ఆంధ్ర ప్రదేశ్ నుండి విశాఖపట్నం గట్టి పోటీ ఇస్తుంది. దక్షిణాది నుండి ఏకైక జిల్లాగా ఉన్న విశాఖ అవార్డును సొంతం చేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు. ఈ అవార్డు ఫలితాలు ఈ నెల చివర్లో రాబోతున్నాయి.

చంద్రబాబు మెప్పుకోసమే మిథున్‌రెడ్డిపై విమర్శలు

మాజీ శాసనసభ్యుడు అకేపాటి అమర్‌నాథ్ రెడ్డి

రాజంపేట, వార్తవళి, సెప్టెంబర్ 17: చంద్ర బాబు నాయుడుతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని అయన మెప్పుకోసం వైస్సార్సీపీ నాయకులను ఎంపీ రఘురామ కృష్ణంరాజు విమర్శిస్తున్నాడని కడప జిల్లా రాజంపేట మాజీ శాసనసభ్యుడు అకేపాటి అమర్ నాథ్ రెడ్డి అన్నారు.పేరు చెప్పకుండా రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి పై ఎంపీ రఘురామ కృష్ణంరాజు చేసిన వాఖ్యలకు నిరసనగా రాజంపేటలో కృష్ణంరాజు దిష్టి బొమ్మను వైకాపా శ్రేణులు దగ్ధం చేసాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు అకేపాటి అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ ముందు తన పదవికి రాజీనామా చేసి మాట్లాడితే అందరు హర్షిస్తారని ,మిథున్ రెడ్డి ని మాట్లాడడం నీతిమాలిన చర్య అన్నారు . పెదిరెడ్డి రామచంద్ర రెడ్డి కుటుంబం ఆరు దశబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారని ,చిత్తూరు జిల్లాలో చంద్రబాబు కంటే వారి కుటుంబానికే మంచి పట్టుందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పోలా శ్రీనివాసులు రెడ్డి,పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు పసుపులేటి సుధాకర్,పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి మర్రి రవి,రాజంపేట పట్టణ బూత్ కమిటీ కన్వీనర్ గోవింద బాలకృష్ణ ,పలువురు వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనాధలకు ఆహార పొట్లాలు పంపిణీ

విశాఖపట్నం దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 17 : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి సత్యనారాయణగారులి 54వ, జన్మదిన శుభ సందర్భంగా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 35వ, వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్‌లి అభ్యర్థి, అలువనకనకరెడ్డి ఆధ్వర్యంలో వార్డు పార్టీ కార్యాలయం నందు కార్యకర్తల మధ్య భారీ కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చుకొని, కార్యకర్తలకు కనకరెడ్డి మిఠాయిలు తినిపించారు అనంతరం 300 మంది అనాధలకు ఆహార పొట్లాలు పంచిపెట్టారు కనకరెడ్డి మాట్లాడుతూ మన విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం వి వి సత్యనారాయణ గారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆయురారోగ్యములు బాగుండాలని మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కార్యకర్తలకు నేనున్నానని భరోసా ఇవ్వాలని కనకరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధానకార్యదర్శి, ఏ,ఆది విష్ణురెడ్డి, వార్డు యూత్ ప్రెసిడెంట్, ఎస్ కె, యాసీన్, నౌషాద్, సుబ్బిరెడ్డి, పి, రాముారెడ్డి, ఏ రెడ్డి, ఏ, రాము రెడ్డి, పెద్ద మూర్తి, సుధా, పెద్ద రమణ, చల్లా రావు, జి రమణ, దుర్గాప్రసాద్, రవి, రాంబాబు, శ్రీకాంత్, పి శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ రెడ్డి, నగేష్, ఇస్మాయిల్, రాజా, శంకర్, కృష్ణ, శంకర్, కొత్తమీర రాజు, అభిదా, కనకమహాలక్ష్మి,, వినోద్, పి కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ



విశాఖపట్నం దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 17 : భారతీయ జనతా పార్టీ, శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, బీజేపీ వైద్య విభాగము, వైజాగ్ ప్రొఫైల్ వారి సహకారంతో బీజేపీ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, విశాఖపట్నం మాజీ డా.కంభంపాటి హరిబాబు గారు విచ్చేసారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర గారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా. కంభంపాటి హరిబాబు గారు ప్రసంగిస్తూ ప్రధాని మోదీ పాలనలో దివ్యంగుల సంక్షేమము కొరకు వారికి విద్య, ఉద్యోగములలో రిజర్వేషన్ కల్పించారని,విశాఖ కలెక్టరేట్ మరియు జిల్లా కలెక్టరేట్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించారని, విశాఖలో 50 కోట్ల రూపాయలతో క్రీడా ప్రాంగణం నిర్మాణమునకు శ్రీకారం చుట్టారని, గత ఆరు సంవత్సరముల కాలంలో విశాఖ, విజినగరం మరియు శ్రీకాకుళం జిల్లాలలోని 12000 మంది దివ్యంగులకు ఉపకరణములు అందజేశామని, 350 దివ్యాన్గులకు మోటరైజ్డ్ ట్రై సైకిల్స్ అందజేశామని తెలియజేసారు. ఈ కార్యక్రమములో బీజేపీ ప్రశిక్షణ కమిటీ కన్వీనర్ నారాయణ రావు గారు, ఆచార్య సింహాద్రి గారు, ఆంధ్రప్రదేశ్ బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ శ్రీ రుపాకుల రవి కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయానంద రెడ్డి గారు, శ్రీ వల్లూరి మోహన్ రావు గారు, నగర ఉపాధ్యక్షులు దుర్గరాజు గారు,పల్లా చలపతిరావు గారు, శర్వాణి గారు, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఆనంద్, శ్రీ వెంకటేశ్వర రావు గారు పాల్గొని 150 మంది దివ్యాన్గులకు ఉపకరణములు అందజేశారు.

ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే సీఎం ఆకాంక్ష

విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 17 : ప్రతి మహిళ ఆర్థికంగ బలోపేతం కావాలన్నదే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్ష అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి అన్నారు. గురువారం నాడు నగరంలోని 9 నుంచి 16 డివిజన్లకు సంబంధించి కమ్మ వీధి లో మరియు 24 వ డివిజన్ బూర్ల పేట లో జరిగిన వైయస్సార్ ఆసరా సంబరాలలో ఆమె పాల్గొన్నారు. సభలో ముందుగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి, విజయనగరం శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళల ఆనందోత్సాహాలు, కరతాళ ధ్వనుల మధ్య కోలగట్ల శ్రావణి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అనతికాలంలోనే ప్రజల వద్దకు చేర్చి ప్రజాభిమానం పొందిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఆడపడుచులకు ఆసరా పథకాన్ని వర్తింప చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సహాయ కమిషనర్ ప్రసాదరావు, నగరపాలక పార్టీ అధ్యక్షులు ఆపావు వేణు, జోనల్ ఇంచార్జ్ గుజ్జల నారాయణరావు, ఆయా వార్డుల ఇన్చార్జులు ఎవర్ని కుమారస్వామి, షకీల్, వెంపటాపు శ్రీనివాసరావు, నాయని మహేష్, గాదం మురళి, బొంతపల్లి గోపి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బోడ సింగి ఈశ్వరరావు, పిల్ల వేణు, మహిళా విభాగం నేతలు శ్రీమతి పిన్నింటి రామలక్ష్మి శ్రీమతి వింధ్య, పార్టీ నాయకులు గొల్లపూడి మాధవరావు, పాండురంగారావు, బి శెట్టి బాబు, నవీన్, నీరజ్, గౌరీ, కాళీ లతో పాటు, సి ఓ లు, ఆర్ పి లు, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి

రాజంపేట అసెంబ్లీ కన్వినర్ పోతుగుంట రమేష్ నాయుడు

రాజంపేట, వార్తవళి, సెప్టెంబర్ 17: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కడప జిల్లా రాజంపేట బీజేపీ అసెంబ్లీ కన్వినర్ పోతుగుంట రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ 70వ పుట్టిన రోజు పురస్కరించుకొని రాజంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారి 70వ జన్మదిన సందర్భంగా వారం రోజుల పాటు "సేవా సప్తాహం0-2020 పేరుతో జరుగుతున్నటువంటి కార్యక్రమంలో నాలుగవ రోజు రెడ్ క్రాస్ సొసైటీ కడప వారి సహకారంతో ఈ యొక్క రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు .ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండేంట్ డాక్టర్ అనిల్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఏ.గుణవర్మ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వి సురేష్ రాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పి అదినారాయణ, పట్టణ అధ్యక్షుడు ఎం వెంకట సుబ్బయ్య నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ రేణు ప్రసాద్, వేణుగోపాల్నాయుడు,మండల అధ్యక్షురాలు బి. ప్రభావతి, మాజీ మండల అధ్యక్షుడు పీ పాపయ్య,నర్సింహ రాజు, రాము, శ్రీనివాస్రాజు ,సుభద్ర, కళావతి, రవిశంకర్, వేణుగోపాల్ రాజు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పుల్లంపేట మండల అన్నమయ్య సుబ్బయ్య .శంకర్ రాజు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై తీవ్ర స్పందన

గాజువాక, వార్తావళి, సెప్టెంబర్ 17 : హిందూ దేవలయాల్లె జరుగుతున్న దాడులను ఖండిస్తూ నిరసనహించిన కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కోఆప్షనేటర్ కిరణ్ కుమార్ శర్మ మాట్లాడుతూ, పిఠాపురంలో విగ్రహాల ధ్వంసం, అంతర్వేదిలో పురాతన రథం అగ్నికి ఆహుతైన ఘటన, దుర్గగుడి రథంలో వెండి సింహాలు మాయం మొదలైన ఘటనలతో హిందువులు పూర్తిగా అసహనానికి లోనైనా సమయంలో, నిన్న నిడమనూరులో సాయిబాబా విగ్రహం ధ్వంసం, ఈరోజు కృష్ణా జిల్లా మక్కపేట గ్రామంలో పురాతన కాశీవిశ్వేశ్వర ఆలయంలో నంది విగ్రహం చెవులు ధ్వంసం చేయడం హేయమై చర్య కొంతమంది అరాచక శక్తులు హిందువుల మనోభావాలు దెబ్బతినే విదంగా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. మేము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. హిందూ దేవతా విగ్రహాలపై ఇటువంటి చర్యలకు పాల్పడమనేది మతాల మధ్య చిచ్చు రగిల్చేదిగా ఉంది. ప్రభుత్వం బాధ్యత వహిస్తూ దోషులను కనిపెట్టి ఎంతటి వారైనా తక్షణమే కఠినమైన శిక్షలు వేసి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. పార్టీలకు అతీతంగా అందరూ ఇలాంటి ఘటనలపై స్పందించి హిందువుల మనోభావాలను కాపాడవలసింది కోరుకున్నారు. కార్యక్రమంలో నేమూరి జగన్, కృష్ణతేర్మ, ప్రాణమూర్తి బ్రాహ్మణ ప్రముఖులు మొ. పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా ఆసరా

శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 17 : మహిళల ఆర్థిక స్థితిగతులను పెంచి ఆర్థిక స్వాతంత్ర్యం రావాలనే ఉద్దేశ్యంతో వై.యస్.ఆర్.ఆసరా పథకాన్ని ప్రారంభించడం జరిగిందని మాజీ మంత్రి, శ్రీకాకుళం శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం ఉదయం చాపురం పంచాయతీ, గోవిందనగర్ కాలనీలో వై.యస్.ఆర్. ఆసరా వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి శాసనసభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం వై.ఎస్.ఆర్ ఆసరా పథకం ద్వారా ఏర్పాటు చేసిన కిరాణా దుకాణాన్ని శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకువెళ్లాలనేది ప్రభుత్వ లక్ష్యమని, వారి ఆర్థికస్థితి గతులు పెంచి, ఆర్థిక స్వతంత్రం రావాలని ప్రభుత్వం కోరుకుంటుందని అన్నారు. ఒక కుటుంబంలోని మహిళలు బాధ్యతగా వ్యవహరిస్తారని, అటువంటివారికి అవసరమైన శక్తిని అందించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బి.నగేష్ , ఏరియా కో ఆర్డినేటర్ కొండలరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి కొటేశ్వరమ్మ, కోఆప్షికారి హేమాలత, ఏ.పి.ఎం త్రినాథమ్మ, అల్లు లక్ష్మీనారాయణ ,ముకళ్ల తాతబాబు ,గుడ్ల రాము ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశాఖ-రాయ్‌పూర్ ప్రతిపాదిత జాతీయ రహదారిపై ప్రజాభిప్రాయ సేకరణ

విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 17 : ప్రతిపాదిత విశాఖపట్నం-రాయ్‌పూర్ కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి, పర్యావరణ అంశాలపై కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆధ్వర్యంలో ఎపి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన రైతులు, రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముందుగా జిల్లా పర్యావరణ ఇంజనీర్ టి.సుదర్శన్ మాట్లాడుతూ ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. దేశ ఆర్థికాభివృద్ధి కోసం, వివిధ ప్రాంతాలమధ్య రహదారి సౌకర్యాలను పెంచేందుకు గానూ, భారత్ మాలా పరియోజన కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో, రాయ్‌పూర్-విశాఖపట్నం మధ్య కొత్తగా 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేని కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా డివ్యూటీ మేనేజర్ ప్రశాంత్ మిశ్రా, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 17 : ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 70 వ జన్మదినోత్సవం పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ విజయనగరం జిల్లా పార్టీ కార్యాలయంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేయుటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు శ్రీమతి రెడ్డి పావని గారు మాట్లాడుతూ మోదీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఆయురారోగ్యాలతో చల్లగా వర్ధిల్లాలని కోరుకుంటూ జిల్లా లో పలు చోట్ల రక్త దాన శిబిరాలని ఏర్పాటు చేయుటం జరిగింది అని అన్నారు. మోదీ గారి జన్మదినం యావత్ దేశానికి ఒక పండుగ లాంటిది అని అందులో భాగంగా సేవా వారోత్సవాలు చేయుటం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాకలపాటి సన్యాసిరాజు గారు, చార్టెడ్ అకౌంటెంట్ బాలాజీ గారు, కుసుమంచి సుబ్బారావు గారు, బవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి గారు, కోటగిరి నారాయణ రావు గారు, బగ్గం రాజేష్ కుమార్ గారు, పాసంగాపల్లి అశోక్ గారు, తీగల హరినాథ్ గారు, జనసేన నాయకుడు బాలు గారు మరియు జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైయస్సార్ ఆసరా అక్క చెల్లెమ్మలకు బాసట

విశాఖపట్నం దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 17 : విఎంఆర్‌డిఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 41వ వార్డు వైకాపా కార్పొరేటరు అభ్యర్థిని శ్రీమతి యాంద్రపు ఫాతిమారాణిగారి ఆధ్వర్యంలో సిఒ గణేష్ నాయకత్వంలో ఆర్‌బిల కృషితో వైయస్సార్ ఆసరా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ ఆసరాలో భాగంగా 134పాదువు సంఘాలకు 3,79,89,390/- మంజూరు కాగా మొదటి విడతగా 95,34,587/- అందుకున్న శుభ తరుణంలో 1300 మందితో విజయోత్సవ భారీ ర్యాలీ నిర్వహించిన్నట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి.

ఆప్కో వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు

డిఎంఓ బి.ఉమాశంకర్

శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 17 : దసరా మరియు దీపావళి పండుగల సందర్భంగా ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపును ఇస్తున్నట్లు ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ బి.ఉమాశంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. దసరా, దీపావళి సందర్భంగా ఎంపిక చేసిన చేనేత వస్త్రాలకు ఒకటి కొంటే రెండు లేదా ఒకటి ఉచితంగా, అలాగే అన్నిరకాల చేనేత వస్త్రాలపై 30శాతం ప్రత్యేక తగ్గింపును ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సదవకాశాన్ని చేనేత వస్త్రప్రియులు మరియు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు. ధర్మవరం, వెంకటగిరి, మాధవరం, ఉప్పాడ, గుంటూరు, బందరు, రాజమండ్రి, మంగళగిరి పట్టు మరియు కాటన్ చీరలు , దుప్పట్లు, బెడ్ షీట్స్, లుంగీలు, టవల్స్, షర్టింగ్ క్లాత్ మొదలైన వస్త్రాలు లభించనున్నాయని, వివిధిగా వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా వావిలాల 114వ జయంతి

విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 17 : స్వాతంత్ర్య సమరయోధుడు,గాంధేయవాది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సభ్యుడు పద్మభూషణ్ పురస్కారగ్రహీత వావిలాల గోపాలకృష్ణయ్య సమాజానికి రాజకీయాలుకి సరికొత్త మార్గం చూపించారని విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆసరా జె.వెంకటరావు అన్నారు, గురువారం పద్మభూషణ్ వావిలాల 114 వ జయంతి కార్యక్రమం ఘనంగా బీఎన్ఆర్ ఆశ్రమంలో నిర్వహించారు ఈ కార్యక్రమం కి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన వావిలాల చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించిన అనంతరం మాటలాడుతూ వావిలాల 1906 సెప్టెంబర్ 17 న గంటూరుజిల్లా సత్తెనపల్లిలో జన్మించారని వావిలాల మద్య పాన నిషేధంకోసం అలుపెరుగని పోరాటం చేసారని, దేశంలో శాంతి సమావేశాలు నిరవధికంగా నిర్వహించిన ఘనత ఒక్క వావిలాల గోపాలకృష్ణయ్య కి మాత్రమే దక్కుతుందని రాష్ట్రలో మారుమూల ప్రదేశాలల్లో కూడా గ్రంధాలయాలు ఉండాలని ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని వావిలాల మన కళ్ళకు కనిపించే అజాత శత్రువు,ఆ జన్మ బ్రమ్మచారికూడా అని జేసీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు,సుంకరి రామకృష్ణ,వర్రి బాబ్జి, పోటుపురెడ్డి శ్రీను, నమ్మి శ్రీను,రెడ్డిపల్లి శ్రీను,పూసర్ల రాజేశ్,మట్టా గోవింద్,కోరుకొండ బుజ్జి,బసవ సత్యనారాయణ, సతీష్,సుధీర్,బంటుపల్లి రమణరావుతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌ను ఆదుకున్న రాజంపేట పోలీసులు



రాజంపేట, వార్తావళి, సెప్టెంబర్ 17: కరోనా వైరస్ బారినపడి ఏపని చేయలేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నఆటో డ్రైవర్‌ను పోలీసులు ఆదుకున్నసంఘటన కడప జిల్లా రాజంపేటలో చోటు చేసుకుంది.రాజంపేట పట్టణం సాతవల్లి పల్లికు చెందిన పెంచలయ్య రాజంపేట పట్టణంలో ఆటో నడుపుతుంటూ జీవిస్తున్నాడు. లాక్ డౌన్ సమయంలో కరోనా వైరస్ భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆటోలో రాజంపేట పట్టణంలోని వీధులన్నీ తిరిగి అనౌన్స్మెంట్ చేస్తూ ప్రజలను దైర్యన్ని పరుస్తూ,పోలీసులకు సహకరించాడు. ఈ క్రమంలో పెంచలయ్య కొద్ది రోజుల క్రితం కరోనా వైరస్ బారినపడ్డాడు. అనారోగ్యంతో చాలా ఇబ్బందులకు గురై నెమ్మదిగా కోలుకున్నప్పటికీ ఆరోగ్యం సహకరించక, ఏపని చేయలేక పోవడంతో తన కుటుంబాన్నిఆదుకోవాలని రాజంపేట అర్బన్ పోలీసు వారిని ఆశ్రయించగా రాజంపేట పట్టణ పోలీస్ ఇన్స్పెక్టర్ శుభకుమార్,ఆయన పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించి కొంతమంది దాతల సహకారంతో ఒక నెల రోజులకు సరిపడు నిత్యవసర వస్తువులను మరియు కొంత మొత్తంలో ఆర్థిక సహాయాన్ని పెంచలయ్యకు అందజేశారు. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని రాజంపేట పట్టణ పోలీసులు ప్రజలకు దైర్యాన్ని కల్పిస్తున్నారు.

జాతీయ రహదారి భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్-1 ఎం. వేణుగోపాల్ రెడ్డి

విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 17: జాతీయ రహదారి భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆనందపురం, అనకాపల్లి 6 లైన్ల జాతీయ రహదారి భూ సేకరణకు సంబంధించి అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత వరకు చేసిన భూ సేకరణకు సంబంధించి చెల్లింపులు చేసింది లేనిది అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ సమస్యలపైన, జాతీయ రహదారి ప్రగతిపైన ప్రత్యేక ఉప కలెక్టర్ (ఎన్.హెచ్.16) ఎం. సూర్యకళ, తహసిల్దార్లతో చర్చించారు. భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరక్టర్, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ సేకరణ ఎన్.హెచ్.16) ఎం.సూర్యకళ, సబ్బవరం, అనకాపల్లి, ఆనందపురం మండలాల తహసిల్దార్లు, పాల్గొన్నారు.

వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది వెంటనే నియమించాలి

సిపిఐ డిమాండ్ -ఆసుపత్రి ముందు ధర్నా

అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 17 : విశాఖ గ్రామీణ జిల్లా కేంద్రమైన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి లో వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, టెక్నీషియన్ మరియు ఇతర సిబ్బంది కొరత తీవ్రమై రోగాన పడి మూలుగుతున్న ఈ ఆస్పత్రికి అత్యవసర చికిత్స చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది బుధవారంస్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రివద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా నాయకులు వై.ఎన్.భద్రం మాట్లాడుతూ అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లుగా ఈ ఆస్పత్రి పరిస్థితి ఉందిన్నారు.అన్న వసతులు ఉండి 250 పడకలు గా ఈ ఆసుపత్రి విస్తరించిన ఇప్పటికీ వంద పడకల అవసరమగు వైద్యులుగాని, నర్సింగ్ సిబ్బందిగాని, టెక్నీషియన్స్, ఎంఎన్వో, ఎఫ్ ఎన్ వో .. వార్డు బాయ్స్ గానీ లేరు. ఈ ఆస్పత్రిలో పేటలన్ (ప్రకారం సుమారు 100మంది వైద్యులు, 150 మంది, నర్సింగ్ స్టాఫ్ ఉండ వలసి ఉండగా కేవలం సుమారు 16 మంది డాక్టర్లు ,సుమారు 25 మంది స్టాఫ్ నర్సులు,పరిమితమైన సంఖ్యలో టెక్నీషియన్స్, ఒక ఎఫ్ ఎన్ వో, ఒక ఎం ఎన్ వో ,మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత వల్ల అత్యవసరంగా ఈ ఆస్పత్రికి వచ్చిన రోగు లను విశాఖ కేజీహెచ్ రిఫర్ చేయడం అలవాటు గా మారిపోయింది .జాతీయ రహదారి కి ఆనుకొని ఉన్న ఆసుపత్రికి యాక్సిడెంట్ కేసులు, పాము కాటు, పాయిజన్ కేసులు ఎక్కువ వస్తుంటాయి. ఈ ఆసుపత్రికి వెంటిలేటర్లు మంజూరు అయినప్పటికీ వాటిని వినియోగించే డాక్టర్లు గాని ట్రైన్ సిబ్బంది గాని లేక స్టోర్ రూమ్ లో మూలుగుతున్నాయిన్నారు. ఈకార్యక్రమంలో పార్టీనాయకులు తాకాశి.వెంకటేశ్వరరావు, కోరిబిల్లి.శంకరరావు కోన.లక్ష్మణ, నాయుడు. మల్లికార్జునరావు, కె.వి.రమణ,చిన్ని, కోరిబిల్లి.జగదీష్, పి.రాజు పాల్గొన్నారు.

శ్రీ విశ్వకర్మ జయంతి

అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 17 : పట్టణ విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో శ్రీ కామాక్షి దేవాలయంలో లక్ష్మివారం శ్రీ విశ్వకర్మజయంతి సందర్భంగా విశ్వకర్మ ఉత్సవమూర్తి విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించి. ఆలయ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని సభ్యులందరూ ప్రసాదాలు స్వీకరించారు.కరోనాకారణం వల్ల ఈ ఏడాది విశ్వకర్మస్వామివారిరథయాత్ర రద్దు చేయడమైనది. ఈ కార్యక్రమంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కోసూరి మన్మథరావు. కార్యదర్శి. టు సూరి చంద్ర శేఖర్. కోశాధికారి కదియం రామకృష్ణ, సంఘం గౌరవ అధ్యక్షులు నాగ అప్పారావు. కోటిపల్లి జేజి బాబు. పట్టణ కార్పెంటర్ సంఘం. మరియు స్వర్ణకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోడీ పేరిట ఊరూరా సేవా కార్యక్రమాలు

అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 17 : ప్రధానమంత్రి మోడీ జన్మదిన సందర్భంగా సేవా సప్తాహ్ ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ గతంలో పలు ప్రాంతాల్లో బిజెపి అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన కార్యక్రమాలు పేదలకు చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధ్యక్షులు సత్యనారాయణ పాల్గొని నిర్వాహకులను అభినందించారు. మోడీ నీ సంకల్పం దృఢమైనదన్నారు. దేశాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆయన యువతకు ఆదర్శం అన్నారు. ఆంధ్రప్రదేశ్లో రానున్న కాలం బీజేపీదే అన్నారు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో ,నాగులాపల్లిలో , సుందరయ్య పేట లో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రింగ్ రోడ్ లో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పరమేశ్వరరావు, యువ మోర్చా అధ్యక్షులు డాక్టర్ గల్లా రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండబాబు మాస్టారు, క్రీ రామకృష్ణ, కొణతాల అప్పలరాజు, జనసేన నాయకులు తాడి రామకృష్ణ, చక్రవర్తి పాల్గొన్నారు.

చైనా 38 వేల చదరపు కి.మీ. ఆక్రమించుకుంది : రాజ్‌నాథ్ !



భారత్ చైనా సరిహద్దు వద్ద గత కొన్ని రోజులుగా యుద్ధ వాతావరణం నెలకొనివుంది. ఇరు దేశాలు కూడా పోటా పోటీగా సైన్యం మోహరింపులతో ఏం క్షణం ఏం జరుగుతుందోన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గాల్వాన్ లోయ ఘటన తరువాత ఈ పరిస్థితి మరింత తీవ్ర తరం అయింది. చైనాతో యుద్ధం కాకుండా సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని భారత్ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ చైనా తన వక్రబుద్ధిని చూపిస్తూనే ఉంది. ఒకవైపు చర్చలు అంటూనే మరోవైపు దాడులకు ఎగబడుతుంది. అయితే మన సైన్యం కూడా చైనాకి దీటుగా జవాబు ఇస్తుంది. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో పరిస్థితులపై రాజ్యసభలో రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ కీలక ప్రకటన చేశారు. సరిహద్దు వివాదంపై ఎంపీలు లేవనెత్తిన ప్రశ్నలకు రాజ్నాథ్ సింగ్ మాట్లాడుతూ .. చైనాతో ఎలాంటి పరిస్థితులున్నా తాము ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మన సాయుధ బలగాలతో చైనాకు ఇప్పటికే గట్టిగా సమాధానమిచ్చామని ఇరుదేశాల మధ్య ఉన్న ఒప్పందాలను చైనా బహిరంగంగానే ఉల్లఘిస్తుందని మరోసారి గుర్తుచేశారు. అలాగే చైనా సైన్యం కదలికలపై నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు. మంగళవారం చైనా సరిహద్దు వివాదంపై రాజ్నాథ్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. సరిహద్దులో పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నాయని సమస్య ఇంకా పరిష్కారం కాలేదని స్పష్టం చేశారు. మన బలగాలు దేశ గౌరవాన్ని ఇనుమడింప చేస్తున్నాయని చైనా దూకుడుకు చెక్ పెట్టేందుకు భారత దళాలు అప్రమత్తంగా ఉన్నాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ లద్దాఖ్ వెళ్లి భారత బలగాలకు భరోసా కల్పించారని చెప్పారు ఎలాంటి పరిస్థితినైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని రాజ్నాథ్ సింగ్ స్పష్టం చేశారు. 1962లో లద్దాఖ్ లో చైనా 38వేల చదరపు కి.మీ మేర ఆక్రమించింది. పాకిస్థాన్ నుంచి రివేల చ.కి.మీ భూమిని తీసుకొంది. అంతేకాదు అరుణాచల్ ప్రదేశ్ లోని 90 వేల చ.కి.మీ భూభాగం తమదని చైనా వాదిస్తోంది. 1988 తర్వాత భారత్ చైనాలు అనేక ఒప్పందాలు చేసుకున్నాయి. వాటిని చైనా ఉల్లంఘిస్తోంది. చైనా చెప్పేదొకటి. చేసేది మరొకటి. సరిహద్దు ఒప్పందాలను ఉల్లంఘించడమే ఇందుకు నిదర్శనం. ఇది మంచి పద్ధతి కాదు. ప్రస్తుతం లద్దాఖ్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అని రాజ్యసభలో రాజ్నాథ్ సింగ్.

మురికి రహిత నగరంగా కడప

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్టి అంజాద్బాష

కడప, వార్తావళి, సెప్టెంబర్ 17 : రాబోయే నాలుగు సంవత్సరాలలో కడప పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నగర రూపురేఖలు మార్చడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి. అంజాద్బాష పేర్కొన్నారు. గురువారం ఉప ముఖ్యమంత్రి వర్యులు గౌస్ నగర్, గంజికుంటకాలనీలలో నీరు నిలిచిన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడుతూ గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల నగరంలోని కొన్ని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. నగరంలో కొంతమంది పెద్ద పెద్ద డ్రైన్ లను ఆక్రమించి ఇల్లు నిర్మించుకోవడంవల్ల వర్షపు నీరంతా బయటికి వెళ్లకుండా రోడ్లపైకి వస్తుందన్నారు. కావున కొత్తగా ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు తప్పకుండా నగరపాలక సంస్థ వారి ప్లాన్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్లాన్ లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడితే అవి తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లవన్న, ఎం హెచ్ వో శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, 31వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్జుతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మహోన్నత శిఖరాలు

శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 17 : మహిళలకు మహోన్నత శిఖరాలకు తీసుకువెళ్ళడమే ముఖ్య మంత్రి లక్ష్యమని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస జూనియర్ కళాశాల ప్రాంగణంలో వై.యస్.ఆర్ ఆసరా వారోత్సవాల కార్యక్రమం ముగింపు కార్యక్రమం గురు వారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళల ర్యాలీ నిర్వహించారు. ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభాపతి తమ్మినేని సీతారాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సభాపతి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనతో మహిళా సాధికారిత దిశగా పయనించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నుండి నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో వివిధ పథకాల క్రింద ఆర్థిక సహాయం జమ చేయడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాలలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదటి స్థానంలో ఉందని సభాపతి చెప్పారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందాలని ఉద్బోధిస్తూరుతున్నారని తెలిపారు. వై.యస్.రాజశేఖర్ రెడ్డి, వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ప్రజల కోసం పుట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలుర క్రికెట్ సంఘం అధ్యక్షులు తమ్మినేని చిరంజీవి నాగ్, శ్రీరామ్మూర్తి , జెజె మోహన్ రావు, జెకే వెంక బాబు, బొడ్డేపల్లి రమేష్ కుమార్, గురుగుబెల్లి శ్రీనివాసరావు, బెండి గోవిందరావు, బెవర మల్లేష్, ఖండపు గోవిందరావు, సువ్వారి గాంధీ ,లోలుగు కాంతారావు, అధికారులు అనధికారు, కార్యకర్తలు ద్వారకా మహిళలు పాల్గొన్నారు.

ఆటో చార్జీలు ఇంత దారుణమా ?

మాడుగుల, వార్తవళి సెప్టెంబరు 17 : లాక్ డౌన్ కారణంగా ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో తిరుగడగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు పాల్పడుతున్నారు. కరోనా మహామ్మారి పుబ్బమా అంటూ ఏ పని లేక జీవనోపాధి కోల్పోయి ఎంతో మంది ప్రజలు, ఎక్కడికి వెళ్ళాలన్న చార్జీల మోతతో నానా అవస్థలు పడుతున్నారు. పని దొరికే చోటుకి వెళ్ళి పనులు చెయ్యడానికి, పనులు వెతుకులాట లో భాగంగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే సమయంలో బస్సులు లేక ఆటోలలో ప్రయాణాలు సాగించే పరిస్థితుల్లో, ఆటో వలాలు చెప్పే చార్జీలు చూసి కంగు తింటున్నారు. ఇదేమని ఎవరైన ప్రశ్నిస్తే అదంతే నచ్చితే ఎక్కండి లేదంటే మానేయ్యండి అంటూ ఆటో వాలాలు దురుసు సమాదానాలు చెప్పే పరిస్థితి ఉంది. మాడుగల నుంచి చోడవరం వరకు 18 కిలోమీటర్ల దూరం ఉంది. అయితే లాక్‌డౌన్‌కి ముందు ఆర్టీసీ, ఆటో చార్జీ 15 రూపాయలు మాత్రమే ఉండేది. అయితే ఇంతలో కరోనా వైరస్ మహమ్మారి పుబ్బమా అంటూ ఆర్టీటీ బస్సు సర్వీసులు నిలుపుదల చెయ్యడంతో పాటు, ఆటోలను కూడా తిప్పకుండా లాక్ డౌన్ పెట్టారు. అనంతరం రాకపోకలు సాగించే క్రమంలో ప్రజలు అవస్థలను చూసి ఒక్కో ఆటోలో ఇద్దరిని మాత్రమే తిప్పాలని లాక్ డౌన్ నిబంధనలు సడలించారు.

అయితే ఒక్కో ఆటోలో పరిమితి సంఖ్య 3 ప్లస్ 1 నాలుగు అయినప్పటికీ ఒక్కో ఆటోలో ఎనిమిది మందిని ఎక్కిస్తేగాని వారికి గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని పలు ఆటో సంఘాలు చోడవరం వరకు ఆటోలో ఇద్దరు లేదా ముగ్గురుని మాత్రమే ఎక్కించి ఒక్కొక్కరి దగ్గర 50 రూపాయలు టిక్కెట్ వసూలు చెయ్యాలని నిర్ణయించుకున్నారు. కాగా కొద్ది రోజుల వరకు దాని పరిస్థితి భాగానే ఉన్నప్పటికీ ప్రస్తుతం ఒక ఆటోలో కిక్కిరిసి పోయిన జనాభాను ఎక్కించడమే కాకుండా టికెట్ అదే మాధిరిగా 50 రూపాయలు వసూలు చేస్తున్నారు. దీని వలన సామాన్య, మధ్యతరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అటువంటి వారి పరిస్థితి కూడా దృష్టిలో ఉంచుకొని ఆటో యూనియన్ సంఘాలు చర్చలు తీసుకొని చార్జీలు నిర్ణయించు విషయాన్ని ఓ చర్చ చేసుకుంటే మంచిదని పలువురు ప్రజలే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా చోడవరం నుంచి మాడుగుల సాయంత్రం 6 గంటలు తరువాత రావాలంటే వంద చెల్లించాల్సిందే. మారు మూల గ్రామాలకు వెళ్ళే ప్రజలు, ప్రయాణికులు పరిస్థితి మరీ దారుణంగా తయారయ్యింది. దీనిపై ఆటో సంఘాలు పునరాలోచన చెయ్యాలని కోరుతున్నారు.

మృతిని కుటుంబానికి హెరిటేజ్ ఆర్థిక సహాయం

మాడుగుల, వార్తవళి సెప్టెంబరు 17 : మృతిచెందిన వ్యక్తికి హెరిటేజ్ డెయిరీలో సభ్య రైతు కావడం వలనఆ కుటుంబాన్ని ఆదుకొనే విధంగా హెరిటేజ్ సంస్థ నుంచి 2 లక్షల రూపాయల నగదు ఆర్థిక సహాయం అందింది. హెరిటేజ్ పాల డెయిరీల్లో పాలుపోసే రైతులకు అన్ని విధాలుగా ఆదుకునే విధంగా చర్యలు తీసుకొని ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుకొని వారికి అన్ని విధాలుగా అండగా నిలబడటం జరుగుతుందని హెరిటేజ్ ఫుడ్ లిమిటెడ్ రావికమతం ప్లాంటు ఆధ్వర్యంలో హెరిటేజ్ ప్రతినిధులు అన్నారు. మాడుగుల మండలంలోని ఎమ్.కె వల్లాపురం గ్రామానికి చెందిన రైతు కోట్నీ వెంకట్రావు ఇటీవల మృతి చెందడంతో, మృతుడుకు చెందిన రైతు నామిని రమణమ్మకు 2 లక్షల రెండు వేల ఐదు వందలు రూపాయలు చెక్కును గురువారం అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీలో పాలు పోసే సభ్య రైతులకు అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని, రానున్నా కాలంలో మరింత అభివృద్ధి చేపట్టే విధంగా చర్యలుతీసుకొని పాలు పోసే రైతులకు మద్దతు ధర అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ హెడ్ శ్రీనివాస్, రీజనల్ హెడ్ నాగప్పారావు, మాడుగుల ఏజెంట్ వాసు, ఒమ్మలి ఏజెంట్‌లు కె.బ్రాహ్మజీ, గాదిరాయి ఏజెంట్ పి.శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

ఉదయగిరి సెప్టెంబర్ 17 వార్తావళి: భారతప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు నియోజకవర్గకేంద్రం అయిన ఉదయగిరి లో ని పూసల కాలనీలో గురువారం ఆ బి. జె. పి. నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కాలనీ ప్రజలమధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ప్రధాని మోదీ సేవలు, సంస్కరణలు కొనియాడారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల. రోశయ్య యాదవ్ (పోటూగాడు), మండల అధక్షులు. గెల్లిబోయిన. వెంకటేశ్వర్లు, బి జె పి మైనార్టీ జిల్లా నాయకులు షేక్. షాజహాన్, యువకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

వైసిపి తిరుపతి పార్లమెంటు సభ్యులు అకాల మరణం పట్ల సంతాపం

కడప, వార్తావళి, సెప్టెంబర్ 17 : వైస్సార్సీపీ తిరుపతి పార్లమెంటు సభ్యులు బల్లి దుర్గాప్రసాద్ గారి అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు మైనారిటీ శాఖ మాత్యులు శ్రీ యస్ బి అంజాత్ బాష . 1985 నుండి నాలుగు పర్యాయాలు ఎంఎల్ఏగా మరియు 1996-1998 కాలములో రాష్ట్ర మంత్రిగా ప్రజలకు సేవలు చేసి వేనోళ్లుగా కొనియాడబడిన నేత బల్లి దుర్గ ప్రసాద్ గారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసారు. ఆయన మరణం పార్టీకి తీవ్ర నష్టమని తెలియజేశారు.

జర్నలిస్ట్ అరుణ్‌శౌరిపై సిబిఐ ప్రత్యేక కోర్టు అవినీతి కేసు నమోదు

ఢిల్లీ: మాజీ కేంద్ర మంత్రి, ఆర్థికవేత్త, జర్నలిస్ట్ అరుణ్‌శౌరిపై సిబిఐ ప్రత్యేక కోర్టు అవినీతి కేసు నమోదు చేసింది. రాజస్థాన్‌లోని ఉదరుపూర్‌లో లక్ష్మీ విలాస్ ప్యాలెస్ హోటల్‌లో పెట్టుబడులు పెట్టారన్న ఆక్రమ కేసులో మాజీ మంత్రి అరుణ్‌శౌరిని నిందితుడిగా పేర్కొంది. అరుణ్‌శౌరితో పాటు మాజీ ప్రభుత్వ అధికారి ప్రదీప్ బైజల్, జ్యోత్న శౌరిలను కూడా నిందితులుగా పేర్కొంది.

సుశాంత్ సింగ్ మృతి కేసు విచారణ

ఢిల్లీ: బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ మృతి కేసు విచారణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా పలువురుని అధికారులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా సుశాంత్ స్నేహితుడు సిద్దార్థ్ పితానిని కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) అధికారులు ప్రశ్నించగా పలు కీలక విషయాలు వెల్లడించాడు. సుశాంత్ మృతి చెందడానికి ముందు పలు ఘటనలు చోటు చేసుకున్నాయని ఆయన అన్నాడు. సుశాంత్ మృతికి కొన్ని రోజుల ముందు ఆయన మాజీ మేనేజర్ దిశా ఆత్మహత్యకు పాల్పడడంతో సుశాంత్ చాలా భయపడ్డాడని సిద్దార్థ్ తెలిపాడు. తనను చంపేస్తారని సుశాంత్ పదే పదే తనకి చెప్పి ఆందోళన చెందేవాడని అన్నాడు. మరింత భద్రతను పెంచుకోవాలని తాను భావిస్తున్నట్లు సుశాంత్ చెప్పాడని తెలిపాడు. అంతేగాక, మరిన్ని విషయాలను కూడా ఆయన సీబీఐ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. కాగా, సుశాంత్ సింగ్ ల్యాప్‌టాప్ తో పాటు హార్డ్‌డ్రైవ్‌ను ఆయన ప్రియురాలు రియా చక్రవర్తి తీసుకువెళ్లిందని కూడా ఆయన అధికారులకు చెప్పినట్లు సమాచారం.

అనిల్ అంబానీకి సుప్రీం కోర్టులో కొంత ఊరట



సుప్రీం కోర్టులో రిలయన్స్ కమ్యూనికేషన్స్ చైర్మన్ అనిల్ అంబానీకి కొంత ఊరట లభించింది. అనిల్ అంబానీ వ్యక్తిగత హామీగా ఉన్న కార్పొరేట్ రుణాలు వసూలు కాకపోవడంతో ఎస్‌బీఐ దివాలా చర్యలకు దిగాలని ఫూరిందిన విషయం తెలిసిందే. అనిల్ అంబానీపై వ్యక్తిగత దివాలా, దివాలా కోడ్(ఐబీసీ) కింద చర్యలు తీసుకునేందుకు, ఆయనపై ఎస్‌బీఐ దాఖలు చేసిన దివాలా పిటిషన్‌పై గతంలో ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈ స్టేను ఎత్తివేయాలని కోరుతూ ఎస్‌బీఐ తాజాగా సుప్రీంను ఆశ్రయించింది. అయితే.. ఎస్‌బీఐ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సుప్రీం కోర్టు గురువారం తిరస్కరించింది.

మహారాష్ట్ర ప్రభుత్వంపై కంగనా రనౌత్ ఆగ్రహం

బాలీవుడ్ హీరోయిన్ నటి కంగనా రనౌత్ ట్వీట్టర్ వేదికగా మహారాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. బీఎంసీ కూల్చివేసిన తన భవనంలోని కొన్ని ఫోటోలను నటి కంగనా రనౌత్ ట్వీట్ చేసింది. ఇది నా కలలు, నా ఆత్మలు, నా ఆత్మగౌరవం, నా భవిష్యత్తుపై అత్యాచారం" అని కంగనా ట్వీట్ చేసింది.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006